క్లుప్తంగా

డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ద్వారా నర్సింగ్ అసిస్టెంట్ కోర్సులో మహిళలకు ఉచిత శిక్షణతోపాటు వసతి సౌకర్యం కల్పిస్తున్నామని ఏనుగొండలోని హైక్వాలిటీ హెల్త్‌కేర్ స్కిల్లింగ్ సెంటర్ మేనేజర్ సాయివినిత తెలిపారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి శనివారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి ప్రైవేట్ హాస్పిటల్స్‌లో ఆన్‌-జాబ్ ట్రెనింగ్, సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఈ కోర్సులో చేరాలనుకునే అభ్యర్థులు 19–28 ఏళ్లలోపు కలిగి ఉండి, కనీసం పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8688983580, 9154909056ను సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సిబ్బంది నీలిమ, హేమప్రియ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మలకు 400 సీట్లు కేటాయించాలి



అడ్డాకుల: విశ్వకర్మలకు జనాభా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో 400 సీట్లను కేటాయించాలని విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ చైర్మన్ విశ్వనాథుల పుష్పగిరి ఆచార్యులు డిమాండ్ చేశారు. విశ్వబ్రాహ్మణ చైతన్య యాత్రలో భాగంగా హైదరాబాద్ నుంచి బ్రహ్మంగారి మఠం వరకు చేపట్టిన పాదయాత్ర శనివారం అడ్డాకుల మండలంలో సాగింది. అడ్డాకులలో విశ్వబ్రాహ్మణ మండల సంఘం నాయకులు పాదయాత్ర బృందానికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పెంటాచారి, భాస్కరాచారి, నవీన్, జగదీశ్, శ్రీధర్, సతీశ్, శివ, రామాచారి, కురుమూర్తి తదితరులు ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



చిన్నచింతకుంట: కౌకుంట్ల మండలం అప్పంపల్లికి చెందిన తెలుగు నాగరాజు ఇటీవల మృతి చెందాడు. 1994–95 పదో తరగతి బ్యాచ్ స్నేహితులు పోగుచేసిన రూ.35వేలను నాగరాజు కుటుంబానికి అందజేశారు. శనివారం నాగరాజు ఇంటికెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో స్నేహితులు రాఘవేందర్‌రెడ్డి, శ్రీనువాసులు, నాగరాజు, గ్రామస్తుడు సీతన్న పాల్గొన్నారు.

నేడు డీఎల్‌ఎఫ్ సమావేశం

జడ్చర్ల: స్థానిక అంబేడ్కర్ కళాభవనంలో దళిత లీడర్‌షిప్ ఫోరం(డీఎల్‌ఎఫ్) ఉమ్మడి జిల్లా సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి వస్పుల ప్రవీణ్‌కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి అధిక సంఖ్యలో దళిత సంఘాల నాయకులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

ఆలయాభివృద్ధికి విరాళం

భూత్పూర్: మండలంలోని కొత్తమొల్గరలోని శివాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి పనులకు రూ.50వేల విరాళాన్ని శనివారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మంగళ్‌భట్‌కు ఘన నివాళి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దివంగత కథక్ నృత్య కళాకారిణి మంగళ్‌భట్‌కు శనివారం జిల్లా కేంద్రంలో నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బాలరాజు, వేణుగోపాల్, రాములు, నర్సింహులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తుది జాబితా విడుదల

మద్దూరు: ఉమ్మడి మద్దూరు మండలంలోని ఎంపీటీసీ జెడ్పీటీసీ స్థానాల తుది జాబితాను శనివారం మద్దూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ సర్సింహారెడ్డి విడుదల చేశారు. మద్దూరు మున్సిపాలిటీగా ఏర్పడటంతో మిగిలిన పరిసర గ్రామాలకు సంబంధించిన 10 ఎంపీటీసీలు, ఒక జెడ్పీటీసీ స్థానానికి తుది జాబితాను విడుదల చేశారు.

వేతనాలందక వేదన

- మూడు నెలలుగా 'ఉపాధి' సిబ్బంది ఎదురుచూపు
- ఈఎంఐలు, చిట్టీలు చెల్లించకలేక ఇక్కట్లు
- కుటుంబ పోషణకు నానాతంటాలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

గండేడ్: జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి వేతనాలు అందడం లేదు. గత కొన్ని నెలలుగా ఈ పరిస్థితి తలెత్తడంతో వారి కుటుంబాల పరిస్థితి దినదిన గండంగా మారింది. పథకంలో అనేక సంస్కరణలు తీసుకొస్తుండడంతో ఉద్యోగులు సిబ్బందిపై తలకు మించిన పనిభారం పడుతున్నది. అయినా ఎక్కడ కూడా నిర్లక్ష్యం చేయకుండా విధులు నిర్వహిస్తున్నారు. ఇంత చేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి సకాలంలో వేతనాలు ఇవ్వకపోడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెలనెలా కుటుంబ పోషణతోపాటు చిట్టీలు, ఈఎంఐలు ఎలా చెల్లించాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 17 మండలాలు ఉండగా.. పాత 14 మండలాల్లో నియమింపబడ్డ ఉపాధి సిబ్బందే పనిచేస్తున్నారు. వీరిలో 10మంది ఏపీఓలు, 1 క్లస్టర్ లెవల్ రీసోర్స్ పర్సన్, 41 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, నలుగురు ఇంజనీరింగ్ కన్సల్‌టెంట్లు, 1 ప్లాంటేషన్ సూపర్‌వైజర్, 50మంది టెక్నికల్ అసిస్టెంట్లు, 140 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. వీరంతా జిల్లాలోని ఆయా మండలాల పరిధిలోని గ్రామాల్లో ఉపాధి పనుల నిర్వహణను కొనసాగిస్తారు.

266 రకాల పనులు

ఈ పథకం కింద 266 రకాల పనులు ఉన్నాయి. పూడిక తీతలు, పారంపాండ్స్, సంకెస్‌పాండ్స్, చేపల కుంటలు, బండింగ్ పనులు, లేవలింగ్, పండ్లతోటల పెంపకం, సీసీరోడ్లు, మట్టి రోడ్ల నిర్మాణం ఇలా రకరకాల గ్రామ సర్వతోముఖాభివృద్ధికి వచ్చే పనులను ఈ పథకం కింద చేపట్టవచ్చు. పనులతోపాటు కూలీలకు కనీస పనిదినాలు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. వీటన్నిటి నిర్వహణలో 2005 నుంచి ఉపాధిహామీ ఉద్యోగులు, సిబ్బంది పనిచేస్తూ వస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనలో అహర్నిశలు కృషి చేస్తున్నా వారికి నెలనెలా వేతనాలు మాత్రం అందడం లేదు.

మూడునెలలుగా వేతనాల్లేవ్

ఉపాధి హామీలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. వచ్చిన జీతంతోనే ఈఎంఐలు, చిట్టీలు, పిల్లల స్కూల్ ఫీజ్‌లు, టూషన్, ఆటో, ఫీజులు ఇతరత్రా చెల్లింపులతోపాటు కుటుంబాన్ని పోషించుకునే వారు. ఏప్రిల్ నుంచి వేతనాలు అందలేదు. దీనివల్ల ఆయా కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే పాఠశాలలు ప్రారంభసమయం కావడంతో విద్యార్థుల ఫీజులు, యూనిఫాం, ట్యూషన్, ఆటో, బస్సుల కిరాయిలు తదితరవి చెల్లించడానికి సిబ్బంది పడుతున్న పాట్లు అంతాఇంత కావు. దీనికితోడు కిరాయి అద్దెలు చెల్లించేవారి ఇక్కట్లు వర్ణనాతీతం. ఆకాశన్నంటే ధరలతో నిత్యావసర వస్తువులు కొనలేక మధ్యతరగతి వారు అవస్థలు పడుతున్నారు.

స్పర్శ యాప్ పేరుతో..

వేతనాల చెల్లింపునకు స్పర్శ యాప్ అడ్డొస్తున్నది. కేంద్రం స్పాన్సర్ చేసే పథకాల నిధుల వినియోగంలో పారదర్శకత, సమర్థత, బాధ్యతను పెంచేందుకు స్పర్శ అనే నూతన డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థను రూపొందించింది. దీనిద్వారా ఉపాధి హామీ పనులకు కేటాయించిన నిధులు వాటికే వినియోగించడానికి రూపొందించారు. అయితే ఇదింకా అమల్లోకి రాలేదు. కేంద్రం నిధులు రెగ్యులర్‌గా విడుదలవుతున్నా వేతనాల విడుదలలో జాప్యం జరుగుతున్నది.

ఈఎంఐలు కట్టమని వేధిస్తుండ్రు



ఇంటి నిర్మాణం నిమిత్తం రెండేళ్ల క్రితం రూ.8లక్షలు రుణం తీసుకున్నా. ప్రతినెలా రూ.16వేల చొప్పున ఈఎంఐ చెల్లించాలి. రెండునెలలుగా చెల్లించలేదు. రుణం ఇచ్చినా వారు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈరోజు రేపంటూ నెట్టుకొస్తున్నాం. దీనికితోడు కుటుంబాన్ని పోషించడం భారంగా ఉంది. అధికారులను అడిగితే వస్తుందని చెపుతున్నారు తప్పా వేతనాలు వేయడం లేదు.

– మహిపాల్, కంప్యూటర్ ఆపరేటర్, గండేడ్

ప్రభుత్వం చొరవ చూపాలి



పంటపొలాలు సస్యశ్యామలం చేయడంతోపాటు గ్రామీణులకు ఉపాధి కల్పించాలనే సంకల్పం బాగుందికాని ఉద్యోగులు, సిబ్బందికి ఇబ్బంది కలగకుండా చూడాలి. ఎన్ని బాధ్యతలు అప్పజెప్పినా సహనంతో చేస్తున్నాం. ఉద్యోగాన్ని నమ్ముకుని బతుకుతున్నాం. నెలల తరబడి జీతాలు రాకపోతే ఎలా బతుకుతాం. నెలనెలా సక్రమంగా వేతనాలు అందించేలా చూడాలి.

– హరిశ్చంద్రుడు, ఏపీఓ, గండేడ్ మండలం.

15ఏళ్లుగా ఈ పరిస్థితి రాలేదు



పదిహేనుళ్లుగా ఉపాధిహామీలో పనిచేస్తున్నాం. ఏనాడు ఈ పరిస్థితి రాలేదు. నెలల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నారు. దీనివల్ల ఫీజులు, పిల్లల జాయినింగ్, డ్రస్సులు కొనాలంటే నానా పాట్లు పడుతున్నాం. అద్దె ఇంట్లో వారి పరిస్థితి మరి దారుణంగా ఉంది. కనీసం టూ వీలర్‌లో పెట్రోలు పోసుకొని తిరగలేని పరిస్థితి. నెలనెలా సక్రమంగా వేతనాలు వేయాలి.

– రాజశేఖర్‌రెడ్డి,
ఉపాధి హామీ ఉద్యోగల సంఘం జేపీసీ చైర్మన్, మహబూబ్‌నగర్ జిల్లా

మూడునాలుగు రోజుల్లో అందుతాయి



ఉపాధి హామీ ఉద్యోగులు, సిబ్బందికి వేతనాల చెల్లింపులో జాప్యం చోటుచేసుకుంది. ఇటీవల కమిషనర్‌తో సమావేశం జరిగింది. పెండింగ్ వేతనాలు చెల్లించనున్నారు. మూడు నాలుగు రోజుల్లో అందరి వేతనాలు అందుతాయి.

– నర్సింహులు, డీఆర్‌డీఓ,
మహబూబ్‌నగర్ జిల్లా

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్థికపరమైన సమస్యల పరిష్కారం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగ జేఏసీ నాయకులతో చేసుకున్న ఒప్పందాన్ని పాటించి నెలకు రూ.700కోట్లు విడుదల చేయాలని తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్, వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో శనివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్కువ నిధులు విడుదల చేయడంతో రాష్ట్రంలోని ఉద్యోగ, పెన్షనర్లు ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇది ప్రభుత్వానికి సమంజసం కాదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 317 జీవోను సవరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో సంఘం పక్షాన అభ్యర్థిని పోటీలో ఉంచాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ వహీద్‌షా, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర కోశాధికారి ఎండీ. రషీద్, రాష్ట్ర కార్యదర్శి షేక్ ఫరీద్, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖలీల్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు హమీబ్ అబ్దుర్ రహెమాన్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కలిసి పనిచేయాలి



అడ్డాకుల: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేయాలని ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ పిలుపునిచ్చింది. శనివారం మండలంలోని గుడిబండ, శాఖాపూర్‌లో ఉమ్మడి మండల సమన్వయ కమిటీ పర్యటించింది. ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకునేందుకు కృషిచేయాలని కోరారు. అదేవిధంగా శాఖాపూర్‌లో సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీహరి, శెట్టిశేఖర్, జగదీశ్వర్, నాగర్జున్‌రెడ్డి, విజయమోహన్‌రెడ్డి, తిరుపతయ్య, బాలనర్సింములు, బగ్గి కృష్ణయ్య, గోవర్ధన్, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

పోలీసులకు బీఆర్‌ఎస్ నాయకుల ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

దేవరకద్ర: కాంగ్రెస్ నాయకులు ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ శనివారం బీఆర్‌ఎస్ నాయకులు దేవరకద్ర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యేను దుర్భాషలాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యేతోపాటు, మండల నాయకులు చేసిన విమర్శలను ఖండిస్తూ మాట్లాడినందుకు కాంగ్రెస్ నాయకులు పోలీసులకు మాపై ఫిర్యాదు చేశారని తెలిపారు. మమ్మల్ని బెదిరింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో సింగిల్ విండో అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, నాయకులు భాస్కర్‌రెడ్డి, చల్మారెడ్డి, బాల్‌రాజు, ఆంజనేయులు, శ్యామ్‌సుందర్‌రెడ్డి, కొండారెడ్డి, సత్యం, తిరుపతయ్య, బుచ్చిరెడ్డి తదితరులు ఉన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షుడు శివన్న

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ రిజర్వేషన్ కోసం రజక నాయకులు 78 ఏళ్లుగా అలుపెరగని పోరాటాలు చేస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షుడు కేతూరి శివ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా ఒకే కులవృత్తి చేస్తున్న దోబీలకు భిన్న రిజర్వేషన్లు కల్పించడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్రం జోక్యం చేసుకుని ఒకే రిజర్వేషన్ కిందకు తీసుకొచ్చి రజకులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రజకుల చిరకాల వాంఛ అయిన ఎస్సీ జాబితాలో చేర్చాలని, అసెంబ్లీలో లేవనెత్తిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో తక్షణమే తీర్మానం చేసి కేంద్రానికి పంపాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేసి తెలుగు రాష్ట్రాల్లో రజకుల సత్తా చూపిస్తామని హెచ్చరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటుతో రజకుల సమాధానం చెబుతామన్నారు. సమావేశంలో రజక రిజర్వేషన్ సమితి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శివకుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, నాయకులు నాగరాజు, సతీశ్‌కుమార్, మనోహర్, యాదేశ్‌కుమార్, మైబూబ్, నర్సింహులు, లక్ష్మణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయే రోజు

మహమ్మదాబాద్: దేశ చరిత్రలోనే ఇది నిలిచిపోయే రోజని కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు నారాయణ తెలిపారు. బీసీల రిజర్వేషన్లు 42శాతంకు పెంచినందుకు శనివారం నంచర్ల గేట్ వద్ద కాంగ్రెస్ నాయకులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల తరబడి బీసీలకు రిజర్వేషన్లు లేక అవస్థలు పడుతూ ఎంతో నష్టపోయారని తెలిపారు. ఎంతోమంది విద్యావంతులు రాజకీయ నాయకులు కూడా పదవులు పొందలేక ఆర్థికంగా రాజకీయంగా నష్టపోయారన్నారు. రాహుల్‌గాంధీ సుదీర్ఘ పాదయాత్ర చేసి బీసీలు నష్టపోతున్నారని గమనించి రిజర్వేషన్లు పెంచాలని నిర్ణయించారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో తీసుకున్న నిర్ణయాన్ని ప్రతి బీసీ స్వాగతిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు మాజీ ఎంపీపీ శాంతీ భాయి, అనంతయ్యగుప్తా, రహీం, మోహన్, లక్ష్మయ్య, నరేశ్, ఈసా, దశరథ్, అంజి ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: చైతన్య సెంట్రల్ స్కూల్ పూర్వవిద్యార్థులు జిల్లాలో విద్యాభివృద్ధికి భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. చైతన్య స్కూల్‌లో 1995 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. చదువుకుని ఉన్నత స్థానంలో ఉన్నవారు జిల్లాలో విద్యాభివృద్ధికి తమవంతుగా కృషి చేయాలన్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెంటర్‌గా వ్యవహరించేందుకు పలువురు పూర్వ విద్యార్థులు అంగీకరించారు. అనంతరం ఏనుగొండ పాఠశాలలో విద్యార్థులకు మెంటర్లు వ్యవహరించేందుకు 15మంది విద్యార్థులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, సిరాజ్‌ఖాద్రీ, మోహన్‌లాల్, శర్మ, తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన పూర్తి చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

నవాబుపేట: భూ భారతికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు, ఇటీవల రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలను త్వరగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సూచించారు. శనివారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న రికార్డుల పరిశీలనను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించి మాట్లాడారు. రేషన్‌కార్డులకు సంబంధించి పూర్తి వివరాలు నమోదు చేసి అన్ని సిద్ధం చేయాలని సూచించారు. రెవెన్యూ సదస్సుల్లో వినతులు వెంటనే పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. భూములకు సబంధించి అన్ని వివరాలు రికార్డుల ప్రకారం సిద్ధం చేయాలన్నారు. సెలువు దినం కూడా భూభారతిలో రికార్డులు సరి చేసేందుకు సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. ఆయన వెంట డీటీ సువర్ణ, ఆర్‌ఐ గాయిత్రీ తదితరులు ఉన్నారు.

భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలి

మహమ్మదాబాద్: భూభారతి ద్వారా వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టరు మధుసూదన్‌నాయక్ తెలిపారు. శనివారం మహమ్మదాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. భూ భారతి ద్వారా వచ్చిన దరఖాస్తులను ఎక్కడ పెండింగ్ పెట్టకుండా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పెండింగులో ఉన్న ఫైళ్లను పరిశీలించారు. రేషన్‌కార్డుల జారీ విచారణ, సీఎం ప్రజావాణి దరఖాస్తులు, ఫొటో జాబితాలో మార్పులు చేర్పులు పెండింగులో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, డీటీ చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

ఉత్సాహంగా గోరింటాకు వేడుకలు



గోరింటాకు వేడుకలో పాల్గొన్న మహిళలు

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు రెడ్డి సేవా సమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో స్థానిక బీకే రెడ్డికాలనీలోని బీబీఆర్ రెడ్డి కమ్యూనిటీహాల్‌లో శనివారం గోరింటాకు వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత మాట్లాడుతూ.. ఆషాఢమాసంలో గోరింటాకు పెట్టుకోవడం మన సంప్రదాయమని, గోరింటాకు గౌరిదేవికి ప్రతీకగా భావిస్తారన్నారు. ఈ మాసంలో నీటిలో మహిళలు ఎక్కువగా పనిచేయడంతో చేతులు, కాళ్ల చర్మవ్యాధులకు గురయ్యే అవకాశం ఉందని, గోరింటాకు పెట్టుకుంటే అనారోగ్యం బారినపడకుండా ఉంటారని ఆయుర్వేదం తెలియజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు మల్లు సరస్వతి, కార్యదర్శి స్వరూప, కోశాధికారి శోభ, వరలక్ష్మి, నర్మదా, శశికళ, హేమలత, ఉదయశ్రీ, వనజ, జ్యోతి, వంశీలత, శ్రీదేవి, సునీత, సుమతి, అనిత, శ్రీల, గీత, మాధవి, ఇందిరా పాల్గొన్నారు.

దళితుల హక్కుల సాధనకు నిరాహార దీక్ష



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్

మహబూబ్‌నగర్ రూరల్: భూమి కోసం.. భుక్తి కోసం.. దళిత హక్కుల సాధనకు ఈనెల 14న నిరాహార దీక్ష చేపడతామని ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ అర్బన్ మండలం ఏనుగొండ రెవెన్యూ గ్రామశివారులోని సర్వేనంబర్ 431, 433/1లో దళితులు సాగు చేసిన భూమిపై హక్కులు కల్పించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో భూమిని ఏనుగొండకు చెందిన 20 దళిత కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. ఆ భూమిని ఫారెస్టు అధికారులు దళితులను బలవంతంగా బెదిరించి పంటలు సాగు చేయకుండా మొక్కలు నాటారన్నారు. ఆ భూమిపై దళితులకు హక్కులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈనెల 14న జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో నిరాహార దీక్షలు చేపడతామన్నారు. మా దీక్షలకు మాదిగలు, మాదిగ ఉపకులాలు, ప్రజాస్వామిక వాదులు, ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో రైతులు సీహెచ్ వెంకటయ్య, కృష్ణ, బాలయ్య, ఎంపీ రాములు, నర్సింహులు, మన్యం, శ్యామ్, శంకర్, మధు, మహేశ్, బాలనాగయ్య, సీహెచ్ శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

నారాయణపేట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై చట్టబద్ధత కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం లోని అంబేద్కర్ భవన్‌లో శనివారం నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ దళపతి రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య పోరాట ఫలితంగానే కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో బీసీ డిక్లరేషన్ లో బీసీ రిజర్వేషన్లు పెంచుతామని ప్రకటించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలపై నిజమైన ప్రేమ లేదని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కంటి తుడుపు చర్యగా కాకుండా చట్టబద్ధతతో కూడిన 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధతలేని ఆర్డినెన్స్‌ల ద్వారా బీసీలకు ఒరిగేదేమీ లేదని, గతంలో కేరళ, బీహార్ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్లు పెంచాలని చేసిన ప్రయత్నాన్ని కోర్టులు అడ్డుకున్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు.కార్యక్రమంలో వెంకటేష్ యాదవ్, ఎడ్ల కుర్మయ్య, గణేష్, వెంకటప్ప, గజలప్ప, రమేష్, పాల్గొన్నారు.

నీటికోసం రైతుల ఎదురుచూపు



మండలంలో నీరులేక వట్టిపోయిన కాలువ

మాగనూర్: వానాకాలం వరిసాగు చేస్తున్న రైతులు కాలువ నీటి కోసం సంగంబండ కుడి లోలెవల్ కెనాల్ సాగునీరు కోసం ఎదురు చూస్తున్నారు. సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో పుష్కలంగా నీరు ఉన్నా ప్రస్తుతం సాగు చేస్తున్న రైతులకు మాత్రం కాలువ నీరు అందడం లేదు. క్షేత్రస్థాయిలో చూస్తే ఇప్పటికే కొందరు కెనాల్ కింద వరిసాగు చేసుకోగా, మరికొందరు రైతులు వరినారు సిద్ధంగా ఉంచుకుని నాటుకు సిద్ధంగా ఉన్నారు. పంటలు కోతలు అయిపోయిన సమయంలో నీటిని వృథాగా వదిలేసి ఇప్పుడు రైతులు వరినాట్లు మొదలుపెట్టిన సమయంలో నీటి సరఫరా నిలిపేయడం ఏమిటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులు త్వరతగతిన కాలువకు నీరు వదలాలని కోరుతున్నారు. ప్రస్తుతం వరి నాట్లు జోరుగా సాగుతున్న సమయంలో కాలువలో నీరు రాకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులకు గురువుతున్నట్లు రైతులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి చివరి ఆయకట్టుకు చేరే విధంగా నీటిని కాలువల ద్వారా విడుదల చేయాలని కోరుతున్నారు.